క్లుప్తంగా

ఘనంగా ఐఓసీ వార్షికోత్సవం



కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకుంటున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: నక్కనదొడ్డి వద్దనున్న ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ డిపోలో శుక్రవారం ఐఓసీ 64వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా డిపో చీఫ్ మేనేజర్ నవీన్‌కుమార్, సీనియర్ మేనేజర్ దాస్ ప్రసాద్, మేనేజర్ హరికృష్ణ ఆధ్వర్యంలో కేక్ కటింగ్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ప్రపంచ ఫార్చ్యూన్ 500 కంపెనీల్లో ఐఓసీ 94 స్థానంలో కొనసాగుతోందని వారు తెలిపారు. ఐఓసీ సరైన నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ అందరి మన్ననలు పొందుతుందన్నారు. కార్యక్రమంలో ఐఓసీ ఉద్యోగులు, డ్రైవర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

పుట్లూరు: గరుగుచింతలపల్లిలో ఓ మహిళ ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యకు యత్నించింది. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన గోపాలకృష్ణ భార్య గంగాదేవి కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. మరోవైపు భర్త తాగుడు బానిసకావడంతో కుటుంబ కలహాలు మొదలయ్యాయి. ఈనేపథ్యంలో తీవ్ర మనస్థాపానికి గురై గురువారం రాత్రి ఒంటికి పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుంది. కుటుంబ సభ్యులు అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రజల ఫిర్యాదులపై స్పందించండి



వాటర్ వర్క్స్ సిబ్బందికి సూచనలిస్తున్న కమిషనర్ మల్లికార్జున

గుంతకల్లుటౌన్: పట్టణ ప్రజల తాగునీటి సమస్యలకు సంబంధించి అందించే ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున వాటర్‌వర్క్స్ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం ఉదయం పాతమున్సిపల్ కార్యాలయ ఆవరణలో నాన్ పీహెచ్ వర్కర్ల మస్టర్‌ను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, కార్మికులు సమయపాలన పాటించాలన్నారు. అక్రమ కొళాయిలను గుర్తించాలన్నారు. నీటి పొదుపుపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. డీఈ రామ్మూర్తి, ఏఈ హరికృష్ణ పాల్గొన్నారు.

కూలీల హాజరుశాతం పెంచండి

యల్లనూరు: మండలవ్యాప్తంగా ఉపాధి హామీ కూలీల హాజరు శాతాన్ని పెంచాలని ఎంపీడీఓ వీరరాజు సిబ్బందికి సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బందితో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో జాబ్‌కార్డు ఉన్న ప్రతి కూలీకి పనులు కల్పించాలన్నారు. వలసలు వెళ్లకుండా చూడాలన్నారు. 7ఏ రిజిష్టర్లు పక్కాగా నమోదు చేసుకోవాలన్నారు. ఏపీఓ షబ్బీర్‌బాషా, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పూర్వాభాద్ర హోమం



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో శుక్రవారం స్వామి జన్మనక్షత్రమైన పూర్వాభాద్రను పురస్కరించుకొని హోమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ యాగశాలలో స్వామివారి ఉత్సవ మూర్తిని కొలువదీర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హోమాన్ని నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

అన్నదాతలకు అందుబాటులో ఉండాలి



చందనలో పంట నమోదును పరిశీలిస్తున్న ఏడీఏ వెంకటరాముడు

యాడికి: ఆర్‌బీకే సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని ఏడీఏ వెంకటరాముడు ఆదేశించారు. శుక్రవారం చందన ఆర్బీకేలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అర్హత కలిగిన కౌలు రైతులకు బ్యాంకు ద్వారా రుణాలు ఇప్పించాలన్నారు. రైతులు సాగు చేసిన పంటలకు ఈ–క్రాప్ నమోదు చేయాలన్నారు. గ్రామ సమీపంలో చేపడుతున్న పంట నమోదును ఏడీఏ పరిశీలించారు. ఏఓ మహబూబ్‌బాషా, వీఏఏ యతీషాపాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణంలో భాగస్వాములు కండి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్దారెడ్డి



పెన్నానదిలో బోర్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

- లబ్ధిదారులకు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పిలుపు

తాడిపత్రి అర్బన్: ఇళ్ల నిర్మాణాల్లో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి లబ్ధిదారులకు పిలుపునిచ్చారు. శుక్రవారం ఎమ్మెల్యే పెద్దారెడ్డి తన నివాసంలో గృహాల లబ్ధిదారులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన పెద్దారెడ్డి మాట్లాడుతూ పేదల సంక్షేమమే లక్ష్యంగా జగనన్న ప్రభుత్వం పని చేస్తోందన్నారు. పట్టణ పరిధిలోని పేదలకు పుట్లూరు రోడ్డులోని ఆర్టీటీ కాలనీ వద్ద, సజ్జలదిన్నె సమీపంలోని జగనన్న కాలనీల్లో ఇంటి పట్టాలను మంజూరు చేసి ప్రభుత్వమే ఆప్షన్ త్రీ కింద ఉచితంగా ఇళ్లను నిర్మించి ఇస్తోందన్నారు. ప్రతి ఒక్కరూ ఇంటి నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యేందుకు సహకరించాలన్నారు. అధికారులు, కాంట్రాక్టర్లు యుద్ధప్రాతిపదికన పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. హౌసింగ్ డీఈ షెక్షావలి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

తాగునీటి కొరత రాకుండా చర్యలు తీసుకోండి

తాడిపత్రి: పట్టణంలో తాగునీటి కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మున్సిపల్ కమిషనర్ రవిని ఆదేశించారు. శుక్రవారం ఆయన పెన్నానదిలోని బోరుబావులను పరిశీలించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మొత్తం ఎన్ని బోర్లద్వారా పట్టణానికి తాగునీరు సరఫరా చేస్తున్నారు, పైప్‌లైన్ల పరిస్థితి ఏమిటని కమిషనర్‌ను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి కొరత రాకుండా అదనపు బోర్లు వేయాలని కమిషనర్‌ను ఆదేశించారు.

అవ్వాతాతలకు జగనన్న అండ



వృద్ధురాలికి పింఛన్ సొమ్ము అందిస్తున్న నాయకులు

బుక్కరాయసముద్రం: రాష్ట్రంలోని నిరుపేదలైన అవ్వాతాతలకు సీఎం వైఎస్ జగనన్న అండగా నిలుస్తున్నారని ఎంపీపీ సునీత, జెడ్పీటీసీ భాస్కర్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సచివాలయంలో సర్పంచ్ పార్వతి అధ్యక్షతన కొత్త పింఛన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఎంపీపీ, జెడ్పీటీసీ భాస్కర్, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత ఆలూరు రమణారెడ్డి లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందించారు. ఎంపీడీఓ విజయభాస్కర్, నాయకులు చికెన్ నారాయణస్వామి, బుల్లే నారాయణస్వామి, చేపల రమణ, పంచాయతీ సెక్రటరి సాధిక్ వలి పాల్గొన్నారు.

పింఛన్ వెరిఫికేషన్ ప్రక్రియను జాగ్రత్తగా చేయండి

బుక్కరాయసముద్రం: పింఛన్ వెరిఫికేషన్ ప్రక్రియను జాగ్రత్తగా చేపట్టాలని ఎంపీడీఓ విజయభాస్కర్ సిబ్బందికి సూచించారు. శుక్రవారం పసులూరు, కొత్తపల్లిలో నూతనంగా మంజూరైన పింఛన్ల వెరిఫికేషన్ ప్రక్రియను పరిశీలించారు. మండలంలో కొత్తగా 206 పింఛన్లు మంజూరయ్యాయని, సిబ్బంది అర్హులకు అన్యాయం జరగకుండా చూడాలన్నారు. ఈఓఆర్డీ దామోదరమ్మ, సర్పంచ్ కల్పన, సెక్రటరి రవికుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పామిడి: మండలానికి 188 కొత్త పింఛన్లు మంజూరైనట్లు ఎంపీడీఓ డీ ప్రభాకర్‌నాయక్ శుక్రవారం తెలిపారు. పాగరూరులో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎల్ మధుసూదన్‌రెడ్డి, పీ కొండాపురంలో 1వవార్డు ఇన్‌చార్జ్ మునగల రంగనాయకులు, పామిడిలో బీసీ నేత జోజోడే కుమార్ లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందించారు.

పుట్లూరు: మండలవ్యాప్తంగా 297 మందికి కొత్తగా పింఛన్లు మంజూరయ్యాయి. కొత్తగా మంజూరైన పింఛన్లలో శుక్రవారం 161 మందికి అందించామని, మిగతా వాటిని వెరిఫికేషన్ ద్వారా పంపిణీ చేస్తామని ఎంపీడీఓ యోగానందరెడ్డి తెలిపారు.

వైభవంగా రాఘవేంద్ర స్వామి రథోత్సవం



స్వామి రథం వద్ద పూజలు చేస్తున్న భక్తులు



తాడిపత్రి అర్బన్: అలంకరణలో స్వామి బృందావనం

గుత్తి రూరల్: ఇసురాళ్ళపల్లిలోని ఆనందాశ్రమంలో రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా శుక్రవారం రథోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం స్వామికి అర్చకులు శుద్ధోదక అభిషేకం, క్షీరాభిషేకం, అష్టోత్తర పారాయణం, పూర్వారాధన, మధ్యారాధన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేపట్టారు. మహిళలు దీపాలు పట్టుకుని స్వామి ఉత్సవ విగ్రహాన్ని రథంపై ఉంచి ఊరేగించారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ వాసుదేవరెడ్డి, నాయకులు పుల్లారెడ్డి, నాగేశారెడ్డి, ఓబుళరెడ్డి, భరత్‌రెడ్డి, సుంకయ్య, లచ్చానుపల్లి సర్పంచ్ మజ్జిగ గోపాల్, ధర్మకర్త లక్ష్మినారాయణరెడ్డి, ఓబుళరెడ్డి స్వామికి పూజలు నిర్వహించారు.

తాడిపత్రి అర్బన్: రాఘవేంద్రస్వామి 352వ ఆరాధనోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి పూర్వారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. తులసి, వివిధ రకాల పూలతో స్వామి బృందావనాన్ని విశేషంగా అలంకరించి విశేష పూజలు చేపట్టారు. సాయంత్రం 7గంటలకు రథోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయకమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

నేడు వైఎస్సార్ విగ్రహావిష్కరణ

శింగనమల: బుక్కరాయసముద్రం సమీపంలోని ముసలమ్మ కట్ట వద్ద నున్న సర్కిల్‌లో శనివారం సాయంత్రం 4 గంటలకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, జిల్లా నాయకులు హాజరవుతారన్నారు. నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

రేషన్ డీలర్ల అసోసియేషన్ అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు



గుంతకల్లు రూరల్: రేషన్ డీలర్ల వెల్ఫేర్ అసోసియేషన్ గుంతకల్లు డివిజన్ అధ్యక్షుడిగా గుంతకల్లు డీలర్ జే.వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. ఈ మేరకు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్. బాలనాగిరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశంలో గుంతకల్లు డివిజన్ అధ్యక్షుడిని ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

నేడు కొత్త పింఛన్ల పంపిణీ

గుంతకల్లుటౌన్: గుంతకల్లు పట్టణ, మండలానికి వైఎస్సార్ పింఛన్ కానుక ద్వారా కొత్తగా మంజూరైన పింఛన్లను శనివారం ఉదయం 9:30 గంటలకు స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి పంపిణీ చేయనున్నారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బి.సుంకప్ప కోరారు.

వైఎస్సార్ వర్ధంతికి తరలిరండి

దివంగత సీఎం డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమం శనివారం ఉదయం 8 గంటలకు మెయిన్‌రోడ్డు వైఎస్సార్ సర్కిల్ వద్ద నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు సుంకప్ప తెలిపారు. ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

లోకాయుక్తను కలిసిన న్యాయవాదులు



జస్టిస్ లక్ష్మణ్‌రెడ్డిని సత్కరిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

తాడిపత్రి అర్బన్: లోకాయుక్త జస్టిస్ లక్ష్మణ్‌రెడ్డిని తాడిపత్రి బార్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఓ వివాహానికి తాడిపత్రికి వచ్చిన జస్టిస్ లక్ష్మణ్‌రెడ్డిని స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఏజీపీ నామాల భాస్కర్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.సదాశివరెడ్డి తదితరులు కలిసి శాలువాతో సత్కరించారు. న్యాయవాదులు ప్రతాప్‌రెడ్డి, రమణారెడ్డి, ఆదిశేషులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



జీవీపీ కాలనీలో సీసీరోడ్డును పరిశీలిస్తున్న హర్షవర్ధన్‌రెడ్డి

తాడిపత్రి: గన్నెవారిపల్లి కాలనీలో జరుగుతున్న అభివృద్ధి పనులను వైఎస్సార్‌సీపీ యువనేత కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. కాలనీలో దాదాపు రూ.5 కోట్లతో డ్రైన్లు, సీసీ రహదారులు నిర్మిస్తున్నట్లు హర్షవర్ధన్‌రెడ్డి తెలిపారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు ఆయన సూచించారు. ఎంపీటీసీ రవికుమార్, కౌన్సిలర్లు రంగనాథరెడ్డి, ఆకుల చిన్ననాగిరెడ్డి, నాయకులు ప్రదీప్‌కుమార్‌రెడ్డి, రాంశేఖర్, ప్రభాకర్‌రెడ్డి, గురుప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి అర్బన్: స్థానిక సుంకులమ్మపాలెం, సీపీఐ కాలనీ సచివాలయాల పరిధిలో కొత్తగా పింఛన్ మంజూరైన వారికి శుక్రవారం ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి పింఛన్ సొమ్ము అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత జగనన్నకే దక్కిందన్నారు. కౌన్సిలర్లు రంగనాథ్‌రెడ్డి, ఆకుల చిన్న నాగిరెడ్డి, వక్ఫ్‌బోర్డు కోశాధికారి బాబయ్య, నాయకుడు బట్టా రాజన్న పాల్గొన్నారు.

అర్హులందరికీ న్యాయం



సమస్యలు తెలుసుకుంటున్న సాయిప్రతాప్‌రెడ్డి

తాడిపత్రి: జగనన్న ప్రభుత్వంలో అర్హులందరికీ న్యాయం జరుగుతోందని వైఎస్సార్‌సీపీ యువనేత కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన తిమ్మేపల్లిలో ఇంటింటికీ వెళ్లి ప్రజలతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా పలువురు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా వాటిని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కుల,మత, రాజకీయ భేదాలు లేకుండా అర్హులందరికీ పథకాలు అందిస్తున్న ఘనత జగనన్నకే దక్కిందన్నారు. మరోమారు జగనన్నను సీఎంగా ఆశీర్వదించాలని కోరారు. జెడ్పీటీసీ రమణమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పల్లె నాగేశ్వర్‌రెడ్డి, నాయకులు నాగార్జునరెడ్డి, బ్రాహ్మణపల్లి శివారెడ్డి, గ్రామ నాయకులు అప్పిరెడ్డి, రఘునాథరెడ్డి, తిప్పారెడ్డి పాల్గొన్నారు.

యువకుడికి గాయాలు

గుత్తి రూరల్: కొజ్జేపల్లి శివారులో నాగసముద్రం క్రాస్ వద్ద శుక్రవారం బైక్‌పై నుంచి పడి ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. బ్రాహ్మణపల్లికి చెందిన వీరాంజనేయులు గుత్తిలో పని ముగించుకుని స్వగ్రామానికి బైక్‌పై బయలుదేరాడు. నాగసముద్రం క్రాస్ వద్ద 67వ నంబర్ జాతీయ రహదారిపై బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని 108లో గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు అనంతపురం తీసుకెళ్లారు.

వివాహానికి ఎమ్మెల్యే రూ.50 వేల ఆర్థికసాయం



నగదు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నేత శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు

గుత్తి రూరల్: బేతాపల్లికి చెందిన ఓ యువతి వివాహానికి ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి రూ.50 వేలు ఆర్థిక సాయం అందించారు. వివరాలు.. గ్రామానికి చెందిన సూర్యకాంతరెడ్డి అనే కార్యకర్త 2017లో మరణించాడు. అప్పట్లో నియోజకవర్గ సమన్వయకర్తగా ఉన్న వై.వెంకట్రామిరెడ్డి సూర్యకాంతరెడ్డి, వై.లీలావతి కుమార్తె నందిని వివాహానికి సాయం చేస్తానని మాట ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం ఎమ్మెల్యే వైవీఆర్ రూ.50 వేలు ఆర్థిక సాయాన్ని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం మార్కెట్ యార్డు వద్ద జరిగిన కార్యక్రమంలో అందించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, నాయకులు వెంకటేశ్వరరెడ్డి, గంగరాజు, బొలికొండి, మల్లయ్యయాదవ్, విశ్వనాథ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఎంసీ.నాగరాజు, కౌన్సిలర్ వరదరాజులు, గోపాల్, భాస్కర్, మోహన్ పాల్గొన్నారు.

గర్భిణులకు 'వైఎస్సార్ సంపూర్ణ పోషణ' వరం



గర్భిణులకు పోషణ కిట్లు అందిస్తున్న పీడీ శ్రీదేవి, ఎంపీపీ సునీత

బుక్కరాయసముద్రం: గర్భిణులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు వరంలాంటివని ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, ఎంపీపీ సునీత పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం గర్భిణులు, బాలింత ఆరోగ్యం కోసం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందిస్తోందన్నారు. మహిళల్లో రక్తహీనత నివారణ కోసం కిట్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఎంపీడీఓ విజయ భాస్కర్, సీడీపీఓ ఉమా శంకరమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, నాగమణి, వైఎస్సార్ సీపీ నేత మనేరి కొండమ్మ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

పెద్దవడుగూరు: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని 5వ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు ఆరోగ్యవంతమైన పిల్లలకు జన్మనివ్వడం కోసం ప్రభుత్వం పౌష్టికాహారం అందిస్తోందన్నారు. తల్లి పాల విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు



ప్రమాద సూచికలు ఏర్పాటు చేస్తున్న డీఎస్పీ వెంకటశివారెడ్డి

బుక్కరాయసముద్రం: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటశివారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వడియంపేటలోని జాతీయ రహదారిపై ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేసి ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. మద్యం సేవించి వాహనాలను నడపరాదన్నారు. వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులు, సరుకులు తరలించరాదన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలను నడిపినట్లు అయితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీఐ నాగార్జునరెడ్డి, డీసీఆర్బీ సీఐ విశ్వనాథ్‌చౌదరి, ఎస్‌ఐ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఖైదీలు ఆరోగ్య నియమాలు పాటించాలి



మాట్లాడుతున్న డాక్టర్ అనుపమ జేమ్స్

బుక్కరాయసముద్రం: ఖైదీలు ఆరోగ్య నియమాలు తప్పక పాటించాలని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ అనుపమ జేమ్స్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా జైల్లో సూపరింటెండెంట్ రెహ్మాన్ అధ్యక్షతన ఖైదీలకు ఎయిడ్స్, క్షయ, లెప్రసీ, హెపటైటీస్–బి వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అనుపమ జేమ్స్ మాట్లాడుతూ ఖైదీలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. మంచి ఆహారం తీసుకోవడంతోపాటు యోగా, వ్యాయామం చేయాలన్నారు. అనంతరం ఖైదీలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఎయిడ్స్ డీపీఎం వెంకటరత్నం, జిల్లా క్షయ నివారణ ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్రావణి, టీబీ ల్యాబ్ సూపర్‌వైజర్ శ్రీనివాసరెడ్డి, సర్వజన సుఖవ్యాధి చికిత్స కేంద్రం కౌన్సిలర్ చెన్నకేశవులు, కర్త సాధి సంస్థ ప్రతినిధి రాజు, జైలర్లు నాగరాజు, వసంత్‌కుమార్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

వృద్ధులకు కంటి పరీక్షలు

తాడిపత్రి: హుస్సేనాపురంలో శుక్రవారం కంటి వెలుగు కార్యక్రమం కింద జీపీఎంఓ మధుసూదనరాజు వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించారు. మొత్తం 60 మందిని పరీక్షించగా 12 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించినట్లు జీపీఎంఓ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

యాడికి: తూట్రాళ్లపల్లి శివారులో శుక్రవారం పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు. నిందితుల నుంచి రూ.10,200 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

తప్పిన ప్రమాదం

పెద్దపప్పూరు: అశ్వర్థనారాయణస్వామి క్షేత్రం కాజ్‌వేపై ట్రాక్టర్ బోల్తాపడిన ఘటనలో ప్రమాదం తప్పింది. పెద్దపప్పూరు ఇసుక రీచ్ నుంచి లోడ్‌తో రాయలచెరువు వెళ్తున్న ట్రాక్టర్ టైర్ పంక్చర్ కావడంతో అదుపుతప్పి పెన్నాలోకి దూసుకెళ్లింది. ఘటనలో డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు. కాజ్‌వేపై అడ్డుగా ఉన్న ట్రాక్టర్‌ను ప్రొక్లెయిన్‌తో బయటకు తీశారు.

ఘనంగా డ్రైవర్ల దినోత్సవం

గుత్తి: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్దనున్న జీపు స్టాండ్ అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం డ్రైవర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ రిబ్బన్ కత్తిరించి అసోసియేషన్ కార్యాలయాన్ని ప్రారంభించారు. జీపు, కారు డ్రైవర్లు రమణ, మహబూబ్ బాషా, చెన్నాజీ, రవి, అంజి, రామచంద్ర, శ్రీనివాసులు, జనార్ధన్ పాల్గొన్నారు.

ఘనంగా జీవిత బీమా వారోత్సవాలు

గుంతకల్లు: స్థానిక హనుమేష్ నగర్‌లోని ఎల్ఐసీ కార్యాలయంలో 67వ జీవిత బీమా వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఎల్ఐసీ బ్రాంచ్ మేనేజర్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి సీనియర్ డీపీఓ జయశంకర్ చౌహాన్‌ను సత్కరించారు. అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ ఈరేష్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

తాడిపత్రి అర్బన్: అక్కన్నపల్లి గ్రామంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సెబ్ పోలీసులు శుక్రవారం సీజ్ చేశారు. తలారి ఆదిని అదుపులోకి తీసుకుని ట్రాక్టర్‌ను కేసు నమోదు నిమిత్తం రూరల్ పోలీసులకు అప్పగించినట్లు సెబ్ సీఐ విజయ్‌కుమార్ తెలిపారు.

భూసమస్యలకు శాశ్వత పరిష్కారం

గుంతకల్లు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు– భూరక్ష కార్యక్రమం ద్వారా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తోందని తహసీల్దార్ రాము పేర్కొన్నారు. సంగాల, తిమ్మాపురం, దంచర్ల గ్రామాల్లో రీసర్వే పూర్తయిన నేపథ్యంలో శుక్రవారం ఆయా గ్రామాల్లో తహసీల్దార్, సర్వేయర్ మారెప్ప ఆధ్వర్యంలో సరిహద్దు రాళ్లను ఏర్పాటు చేశారు. రైతులకు ఒక్క రూపాయి ఖర్చు లేకుండా సర్వే చేయడంతోపాటు సరిహద్దు రాళ్లను ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ తెలిపారు.

నేడు వైఎస్సార్ వర్ధంతి

గుత్తి: పట్టణంలోని గాంధీ సర్కిల్ వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహం వద్ద శనివారం ఉదయం 9 గంటలకు వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ సీనియర్ నేత శ్రీనివాసరెడ్డి తెలిపారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

శింగనమల: స్థానిక వైఎస్సార్ విగ్రహం వద్ద శనివారం వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీసీఎంఎస్ డైరెక్టర్ శ్రీరామిరెడ్డి తెలిపారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

తాడిపత్రి అర్బన్: స్థానిక వైఎస్సార్ సర్కిల్ వద్ద శనివారం ఉదయం 8 గంటలకు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమం జరగనుంది. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు కోరాయి.

తప్పుల్లేని ఓటరు జాబితా తయారు చేయండి

గుత్తి రూరల్: మునిసిపాలిటీతో పాటు మండల వ్యాప్తంగా తప్పుల్లేని ఓటరు జాబితా తయారు చేయాలని ఆర్డీఓ రవీంద్ర, డీపీఓ ప్రభాకరరావు, తహసీల్దార్ మహబూబ్‌బాషా సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో బీఎల్‌ఓలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ బీఎల్‌ఓలు ఇంటింటికి వెళ్లి ఓటరు జాబితా ప్రకారం ఓటరు పూర్తి వివరాలను నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. 2022 జనవరి 1 నుంచి ఇప్పటి వరకూ జరిగిన మార్పులు, చేర్పులను పరిశీలించారు. సీఎస్‌డీటీ సూర్యనారాయణ పాల్గొన్నారు.

యువకుడిని చితకబాది నగదు అపహరణ

గుత్తి: గుత్తి – గుత్తి ఆర్ఎస్ మార్గమధ్యంలో ఐదుగురు గుర్తు తెలియని వ్యక్తులు రవి అనే యువకుడిని అటకాయించి, చితకబాది నగదు, సెల్‌ఫోన్ అపహరించారు. వివరాలు.. గుత్తికి చెందిన రవి..గుత్తి ఆర్ఎస్‌లోని ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో పని చేసేవాడు. గురువారం అర్ధరాత్రి సమయంలో బైక్‌పై గుత్తి ఆర్ఎస్ నుంచి గుత్తికి వెళ్తుండగా మార్గమధ్యలోని కేంద్రీయ విద్యాలయం వద్ద ఐదుగురు గుర్తుతెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనాలపై వచ్చి రవి బైక్‌ను అటకాయించి, చితకబాదారు. అతని జేబులో ఉన్న రూ. 1,200 నగదు, సెల్‌ఫోన్ తీసుకెళ్లారు. ఈ ఘటనపై బాధితుడు రవి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.